నమస్తే తెలంగాణ

# సూర్యాపేట

5 | నల్లగొండ, గురువారం 7 మార్చి 2024 | SURYAPET




## దేదీప్యం.. ఛాయా సోమేశ్వరాలయం

నల్లగొండ జిల్లా కేంద్రం సమీపం పానగల్‌లోని అత్యంత ప్రాచీనమైన ఛాయా సోమేశ్వరాలయం విద్యుద్దీపాలతో దేదీప్యమానంగా వెలుగుతున్నది. మహాశివరాత్రి ఉత్సవాలను పురస్కరించుకొని ఆలయాన్ని రంగురంగుల విద్యుత్ దీపాలతో అలంకరించారు. రాత్రివేళ మిరుమిట్లు గొలిపే వెలుగుల్లో ఆలయం చూడముచ్చటగా కనిపిస్తున్నది.

## విశిష్ట సేవా పురస్కారాలకు దరఖాస్తులు

రామగిరి, మార్చి 6 : ప్రపంచ మహిళా దినోత్సవం పురస్కరించుకుని ఉమ్మడి నల్లగొండ జిల్లాతోపాటు రాష్ట్రంలో వివిధ రంగాల్లో సేవలందించే విశ్వబ్రాహ్మణ మహిళలకు 'విశిష్ట సేవా పురస్కారం – 2024' అందించేందుకు అర్హులైన మహిళా ఉద్యోగుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు విశ్వబ్రాహ్మణ సేవా సంస్థ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు దాసోజు శ్రీనివాస్, పెందోట సోము, ప్రచార కార్యదర్శి బొడ్డుపల్లి రామకృష్ణ బుధవారం సంయుక్త ప్రకటనలో తెలిపారు. విద్య, వైద్యం, పోలీసు, రవాణా, న్యాయ శాఖ, స్త్రీ శిశు సంక్షేమ, మున్సిపల్, పంచాయతీ రాజ్, సామాజిక సేవ, సాహిత్యం, కళారంగాల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విశ్వబ్రాహ్మణ మహిళలు తమ పూర్తి బయోడేటాతో పాస్‌పోర్టు సైజు ఫొటో, ఫోన్ నెంబర్, ఇతర వివరాలను జత చేస్తూ దరఖాస్తులు అందజేయాలని పేర్కొన్నారు. దరఖాస్తులను ఈ నెల 20లోపు సమర్పించాలని సూచించారు. ఎంపికైన వారికి ఈ నెల 24న నల్లగొండలోని విశ్వకర్మ భవనంలో విశిష్ట సేవా పురస్కారాలు అందజేస్తామని తెలిపారు. వివరాలకు 9490493499, 9885056185, 9441464552 లలో సంప్రదించాలని సూచించారు.

# మేళ్లచెర్వులో 'మహా' సందడి

**రేపటి నుంచి 12వరకు శివరాత్రి ఉత్సవాలు**

**రాష్ట్ర స్థాయి ఎద్దుల పందేలు, కబడ్డీ పోటీలకు ఏర్పాట్లు**



ఉత్సవాలకు ముస్తాబైన శంభులింగేశ్వర స్వామి ఆలయం

మేళ్లచెర్వు , ఫిబ్రవరి 6 : మేళ్లచెర్వు శంభులింగేశ్వరుడి క్షేత్రం మహాశివరాత్రి వేడుకలకు సిద్ధమవుతున్నది. ఈ నెల 8నుంచి 12 వరకు ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు అధికార యంత్రాంగం ఏర్పాట్లు చేస్తున్నది. ఇక్కడికి ఉమ్మడి నల్లగొండ, ఖమ్మం జిల్లాలతోపాటు ఏపీలోని కృష్ణా, గుంటూరు జిల్లాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో వస్తుంటారు. వేడుకలను ప్రశాంతంగా జరిపేందుకు వెయ్యి మంది సిబ్బంది, సీసీ కెమెరాలతో పోలీస్ బందోబస్తు నిర్వహిస్తున్నారు.

### కోటి రూపాయలతో జాతర ఏర్పాట్లు

జాతర ఏర్పాట్ల కోసం రాష్ట్ర ప్రభుత్వం రూ.కోటి ఎస్‌డీఎఫ్ నిధులను విడుదల చేసింది. దాంతో దక్షిణ రాజగోపురం నిర్మాణంతోపాటు భక్తులకు అన్నప్రసాదం ఏర్పాటు చేయనున్నారు. రాష్ట్రస్థాయి ఎద్దుల పందేలు, కబడ్డీ పోటీల నిర్వహణకు చేపట్టిన స్టేజీ, కోర్టు నిర్మాణ పనులు పూర్తి కావస్తున్నాయి.

### జాతర కార్యక్రమాలు

ఈ నెల 8న తెల్లవారు జామున శివాలయంలో స్వామి కి అభిషేకాలతో జాతర మొదలు కానున్నది. అదే రోజు సాయంత్రం ప్రభల ఊరేగింపు, రాత్రి 12 గంటలకు శివపార్వతుల కల్యాణం నిర్వహిస్తారు. 9న తెలుగు రాష్ట్రాల స్థాయి ఎద్దుల పందేలు, కబడ్డీ పోటీలు ప్రారంభం కానున్నాయి. 10న ఉదయం స్వామివారి రథోత్సవం, 11న రుద్రాభిషేకాలు, ప్రత్యేక పూజలు, 12న రాత్రి పవళింపు సేవతో జాతర ముగియనుంది. అదేరోజు రాత్రి ఎద్దుల పందేలు, కబడ్డీ పోటీల విజేతలకు బహుమతుల ప్రదానం చేస్తారు.



విద్యుత్ లైట్లతో మేరిమాత ఆలయం


## నేటి నుంచి సాగర్ మాత ఉత్సవాలు

నందికొండ, మార్చి 6 : నాగార్జున సాగర్‌లోని ఆంధ్రా ప్రాంతమైన రైట్ బ్యాంక్‌లో ఉన్న సాగర్ మాత ఆలయంలో ప్రతియేటా మార్చి 7, 8, 9 తేదీల్లో మూడు రోజులపాటు ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తారు. 1977లో వెలసిన ఈ ఆలయానికి ప్రతియేటా ఉత్సవాలు కులమతాలకు అతీతంగా నిర్వహిస్తారు. కృష్ణానదికి కుడి వైపున మేరీమాత సాగర్ మాతగా వెలిసిన ఈ పుణ్య క్షేత్రంలో కోరిన కోరికలు తీరుతాయని భక్తుల విశ్వాసం. జాతరకు తెలుగు రాష్ట్రాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో హాజరవుతారు. ఉత్సవాల సందర్భంగా ఆలయాన్ని విద్యుత్ లైట్లతో సుందరంగా అలంకరించారు. ఉత్సవాలకు అన్ని ఏర్పాట్లు చేశామని ఆలయ గురువులు పాలిశెట్టి బాలసాగర్, అల్లం చిన సైరెడ్డి తెలిపారు.

# ఎల్ఆర్ఎస్‌పై కదం తొక్కిన బీఆర్ఎస్

**కాంగ్రెస్ నేతలు మాట తప్పొద్దంటూ నిరసనలు**

**ల్యాండ్ రెగ్యులరైజేషన్ స్కీమ్ (ఎల్ఆర్ఎస్)పై కాంగ్రెస్ పార్టీ ద్వంద్వ వైఖరి పట్ల బీఆర్ఎస్ ఆగ్రహం వ్యక్తం చేసింది. ప్రతిపక్షంలో ఉన్నపుడు ఎల్ఆర్ఎస్‌ను ఉచితంగా అమలు చేయాలని డిమాండ్ చేసిన కాంగ్రెస్ నేతలు, ఇప్పుడు అధికారంలోకి రాగానే చార్జీలు ఎలా వసూలు చేస్తారంటూ ఆందోళనలకు దిగింది. ఎన్నికల ముందు హామీ ఇచ్చిన మేరకు ఉచితంగానే ఎల్ఆర్ఎస్‌ను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ బుధవారం ఉమ్మడి జిల్లాలోని అన్ని నియోజకవర్గ కేంద్రాల్లో ధర్నాలు నిర్వహించింది. కాంగ్రెస్ ప్రభుత్వ మోసపూరిత వైఖరిని నిలదీస్తూ పెద్దసంఖ్యలో ఆ పార్టీ శ్రేణులు ఆందోళనల్లో కదం తొక్కాయి.**



సూర్యాపేటలో ధర్నాలో మాట్లాడుతున్న ఎంపీ బడుగుల లింగయ్య యాదవ్, చిత్రంలో బీఆర్ఎస్ నాయకులు




మిర్యాలగూడలో ప్లకార్డుతో నిరసన తెలుపుతున్న మాజీ ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్‌రావు

**అప్పుడో మాట.. ఇప్పుడో మాట.. ఏంటంటూ నిలదీత**

**ఉచితంగా అమలు చేసే వరకు పోరాటం**

**అన్ని నియోజకవర్గాల్లో బీఆర్ఎస్ ధర్నాలు**

**నేడు కలెక్టర్లు, ఆర్డీఓలకు విజ్ఞాపనలు**



నల్లగొండ క్లాక్ టవర్ సెంటర్ వద్ద మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో ధర్నా నిర్వహిస్తున్న బీఆర్ఎస్ శ్రేణులు, చిత్రంలో జడ్పీ చైర్మన్ బండా నరేందర్‌రెడ్డి, నాయకులు

నల్లగొండ ప్రతినిధి, మార్చి6 (నమస్తే తెలంగాణ) : ఎల్ఆర్ఎస్ దరఖాస్తుదారులను కాంగ్రెస్ సర్కార్ మోసం చేయడంపై బీఆర్ఎస్ పార్టీ మండిపడుతున్నది. బుధవారం జిల్లా అంతటా ధర్నాలు చేపట్టింది. నల్లగొండ జిల్లా కేంద్రంలోని క్లాక్‌టవర్ సెంటర్‌లో మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ధర్నాలో బీఆర్ఎస్ శ్రేణులు పెద్దసంఖ్యలో పాల్గొన్నాయి. జడ్పీ చైర్మన్ బండ నరేందర్‌రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొనగా పార్టీ ముఖ్య నేతలంతా తరలివచ్చారు. దేవరకొండలో బస్టాండ్ వద్ద పార్టీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే రవీంద్రకుమార్ ఆధ్వర్యంలో పెద్దఎత్తున ధర్నా జరిగింది. నియోజకవర్గ ముఖ్యనేతలు, ప్రజాప్రతినిధులంతా తరలివచ్చారు. మిర్యాలగూడలోని ఆర్డీఓ కార్యాలయం ఎదుట మాజీ ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్‌రావు ఆధ్వర్యంలో జరిగిన ఆందోళనలో ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి, చింతరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, పార్టీ నేతలు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. నకిరేకల్ మెయిన్ సెంటర్‌లో మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. కాంగ్రెస్ ప్రభుత్వ మోసపూరిత వైఖరికి వ్యతిరేకంగా నినదించారు. మునుగోడులో మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు. మెయిన్ రోడ్డుపై బైఠాయించి ఉచితంగా ఎల్ఆర్ఎస్‌ను అమలు చేయాలని డిమాండ్ చేశారు. పాల్వాయి స్రవంతి, పార్టీ నేతలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. సూర్యాపేటలోని మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు, ఎంపీ బడుగుల లింగయ్యయాదవ్ నేతృత్వంలో జరిగిన ఆందోళనలో పెద్ద సంఖ్యలో పార్టీ నేతలు, కార్యకర్తలు భాగస్వాములయ్యారు. కోదాడలో మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్ ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ నిర్వహించి ఖమ్మం క్రాస్‌రోడ్డులో ధర్నా చేపట్టారు. హుజూర్‌నగర్, తుంగతుర్తిలోనూ పార్టీ నేతలు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు ఎల్ఆర్ఎస్ చార్జీలను నిరసిస్తూ పెద్ద సంఖ్యలో కదం తొక్కారు. యాదాద్రిభువనగిరి జిల్లా కేంద్రంలో పార్టీ నేతలు, కార్యకర్తలతో కలిసి పార్టీ జిల్లా అధ్యక్షుడు కంచర్ల రామకృష్ణారెడ్డి ఆందోళన చేపట్టారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఆలేరు తాసీలార్ కార్యాలయం ఎదుట మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీతా మహేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఆందోళనలో పెద్ద సంఖ్యలో పార్టీ శ్రేణులు పాలుపంచుకున్నాయి. ఎల్ఆర్ఎస్‌పై కాంగ్రెస్ సర్కార్ ప్రజలను మోసం చేస్తున్నదని, గతంలో వాళ్లు చెప్పిన మాదిరిగానే ఉచితంగానే ఎల్ఆర్ఎస్‌ను అమలు చేయాలని బీఆర్ఎస్ పార్టీ నేతలు ఈ సందర్భంగా డిమాండ్ చేశారు. ఉచితంగా అమలు చేసే వరకు ప్రజల పక్షాన బీఆర్ఎస్ పోరాటం కొనసాగిస్తుందని హెచ్చరించారు. ఇక గురువారం జిల్లా కలెక్టర్లు, ఆర్డీఓలకు ఎల్ఆర్ఎస్‌ను ఉచితంగా అమలు చేయాలంటూ డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్ నేతలు వినతిపత్రాలు అందజేయనున్నారు.



దేవరకొండ ధర్నాలో నినాదాలు చేస్తున్న మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ నల్లగొండ జిల్లా అధ్యక్షుడు రమావత్ రవీంద్రకుమార్, పాల్గొన్న నాయకులు

## విద్యార్థులు పరిశోధనల వైపు దృష్టి సారించాలి

- ఎంజీయూ సదస్సులో ఓయూ లా విభాగం ప్రొఫెసర్ జీబీ రెడ్డి

రామగిరి, మార్చి 6 : విద్యార్థులు నేటి ఆధునిక కాలానికి అనుగుణంగా కొత్త అవకాశాలను అందిపుచ్చుకునేలా పరిశోధనల వైపు దృష్టి సారించి ముందుకు సాగాలని ఉస్మానియా యూనివర్సిటీ లా విభాగం ప్రొఫెసర్ జీబీ రెడ్డి సూచించారు. మహాత్మాగాంధీ యూనివర్సిటీ ఐపీ ఆర్ సెల్ ఆధ్వర్యంలో కేంద్ర, రాష్ట్ర శాస్త్ర, సాంకేతిక మంత్రిత్వ శాఖల సహకారంతో బుధవారం నిర్వహించిన ఒక రోజు సెమినార్‌ను ఎంజీయూ వీసీ గోపాల్‌రెడ్డితో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా జీబీ రెడ్డి మాట్లాడుతూ సవాళ్లను స్వీకరించి ఆలోచనలను వదిలిపెట్టి చిరు ప్రయత్నంతో ఆచరిస్తే పేటెంట్ అవుతుందన్నారు. దేశం, ప్రపంచ వ్యాప్తంగా జరిగిన ఆవిష్కరణలు, వాటి ప్రాముఖ్యతను, మన దేశంలో అద్భుతమైన ఆవిష్కరణలకు ఉన్న అవకాశాలను విద్యార్థులకు వివరించారు. నిత్యం వాడుకలో ఉన్న అనేకమైన చిన్న చిన్న వస్తువులను సైతం వందల సంఖ్యలో నమోదైన పేటెంట్లు అంశాన్ని గుర్తు చేశారు. అనంతరం లా కళాశాల అధ్యాపకురాలు ప్రశాంతి మాట్లాడుతూ భారత దేశ సాంప్రదాయక జ్ఞానం ప్రపంచ దేశాలకు దిక్సూచి అన్నారు. ఎంజీయూ వీసీ గోపాల్‌రెడ్డి మాట్లాడుతూ ఐపీఆర్‌పై అవగాహన, కొత్త ఆవిష్కరణలకు వాతావరణాన్ని మరింత మెరుగుపర్చాలని అన్నారు. తెలంగాణ శాస్త్ర సాంకేతిక మండలి రిసెర్చ్ అసోసియేట్ అనిల్‌కుమార్ మాట్లాడుతూ కొత్త ఆలోచనలకు రాష్ట్ర ప్రభుత్వం సహాయ సహకారాలు అందించడంలో ముందుంటుందని తెలిపారు. అధ్యాపకులు, విద్యార్థులు కొత్త ఆవిష్కరణల్లో ముందుకు రావాలన్నారు. ఐసీఆర్ సెల్ డైరెక్టర్ దోమల రమేశ్ అధ్యక్షతన జరిగిన ఈ సదస్సులో ఓఎస్‌డీ అంజిరెడ్డి, సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రేమ్‌సాగర్, ప్లేస్‌మెంట్ అధికారి ప్రశాంతి, చిల్కూరి రమేశ్, భిక్షమయ్య, మశ్చేందర్, వివిధ యూనివర్సిటీల ప్రొఫెసర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

# చేతికొచ్చిన పంట.. పశువులకు మేతాయె

**నాలుగు చెరువులు ఉన్నా చుక్క నీరు కరువు**

- సాగర్ కాల్వ రాక కరువు కోరల్లో రసూల్‌పురం గ్రామం
- నీళ్లు లేక 90 శాతం ఎండిన వరి పంటలు



రసూల్‌పురంలో ఎండిపోయిన వరి పొలంలో మేస్తున్న గొర్రెలు



రసూల్‌పురంలో ఎండిపోయిన వరి చేనులో మేస్తున్న పశువులు

నల్లగొండ రూరల్, మార్చి 6 : అన్నదాతలకు దశాబ్దం క్రితం కనిపించిన కరువు మళ్లీ తాండవిస్తున్నది. నాగార్జున సాగర్ ఎడమ కాల్వ నుంచి నీరు అందక, మరో వైపు భూగర్భ జలాలు అడుగంటడంతో సాగు నీటి సమస్య నెలకొన్నది. యాసంగిలో వరి వేసిన రైతులకు నిరాశే మిగులుతున్నది. వర్షాభావ పరిస్థితుల కారణంగా బోర్ల నుంచి నీరు రావడం లేదు. వ్యవసాయ బావుల్లో పూడిక తీసినా నీటి ఊట కనిపించడం లేదు. దాంతో నల్లగొండ మండలంలోని రసూల్‌పురం గ్రామంలో ఈ యాసంగికి సాగు చేసిన వరి పంటలు 90 శాతం మేర ఎండిపోయాయి. దిక్కుతోచని స్థితిలో రైతులు ఎండుతున్న వరి చేన్లను బర్రెలు, గొర్రెల మేత కోసం పెంపకందారులకు ఇస్తున్నారు.

### ఎండిన చెరువులు

రసూల్‌పురంలో వరి 1,483 ఎకరాల్లో వరి, 73 ఎకరాల్లో వివిధ రకాల తోటలు సాగు చేస్తున్నారు. గ్రామానికి ఇరు వైపులా ఊరకుంట చెరువు, సవటకుంట చెరువు, నర్సప్ప చెరువు, కర్నాటి కుంట చెరువులు ఉన్నాయి. సాగర్ ఎడమ కాల్వ ద్వారా నీటిని విడుదల చేస్తే ఈ నాలుగు చెరువులు నిండుకుండలా ఉండేవి. దాంతో గ్రామ పరిసర ప్రాంతాల్లోని బోర్లు పుష్కలంగా పోసేవి.

ఇప్పుడు ఆ చెరువులు పూర్తిగా ఎండిపోవడం, సాగునీరు రాకపోవడంతో బోర్లు అడుగంటి పోయాయి. గత ప్రభుత్వం కాలంలో ఇంతటి దుస్థితి ఎప్పుడూ రాలేదని స్థానిక రైతులు ఆవేదన వ్యక్త చేస్తున్నారు.

### 8 ఎకరాల వరి పొలం ఎండిపోయింది



నేను ఎవుసం మొదలు పెట్టి 15 ఏండ్లవుతున్నది. ఆనాటి కరువు మల్లగిప్పుడు వచ్చింది. మాకు 14 ఎకరాలు ఉంటే ఈ యాసంగికి 10 ఎకరాల్లో వరి వేసినం. 5 బోర్లు మొత్తం అడుగంటి పోయినయి. నీళ్లు లేక 8 ఎకరాల వరి పొలం ఎండిపోయింది. దాంట్లో నాకున్న నాలుగు బర్రెలను మేతకు వదిలేసిన. రాబోయే రోజుల్లో ఎట్లుంటదో భయమేస్తున్నది. ఎండిపోయిన పంటలకు ప్రభుత్వాలు ఆదుకోవాలి.

–గుండెబోయిన లింగయ్య యాదవ్, రైతు, రసూల్‌పురం, నల్లగొండ మండలం

### ఎండిన పొలంలో గొర్రెలు మేపుతున్నా



మాకు రెండు ఎకరాలు ఉంటే అందులో వరి సాగు చేసిన. మూడు బోర్లు ఉండే. అవి పూర్తిగా అడుగంటి పోయినయి. 280 ఫీట్లతో ఒక బోరు వేసినా నీళ్ల చుక్క పడలే. పంట మొత్తం ఎండిపోయింది. చేసేదేం లేక అందులో మా గొర్రెలను మేపుతున్నాం. మా ఊర్లో చాలా పొలాలు నీళ్లు లేక ఎండిపోయినయి.

–బొమ్మెనబోయిన జానమ్మ, రైతు రసూల్‌పురం, నల్లగొండ మండలం



నిందితుల వివరాలు తెలుపుతున్న మిర్యాలగూడ డీఎస్పీ

## అంతర్రాష్ట్ర డీజిల్ దొంగల ముఠా అరెస్టు

**రూ.6లక్షల నగదు, 4 వాహనాలు, 700 లీటర్ల డీజిల్ స్వాధీనం**

నీలగిరి, మార్చి 6 : జాతీయ రహదారుల వెంట పార్కింగ్ చేసిన లారీల నుంచి డీజిల్ చోరీకి పాల్పడుతున్న దొంగల ముఠాను పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. వారి నుంచి రూ.6లక్షల నగదు, 4 వాహనాలు, 700 లీటర్ల డీజిల్‌ను స్వాధీనం చేసుకున్నారు. జిల్లా కేంద్రంలోని ఎస్పీ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మిర్యాలగూడ డీఎస్పీ రాజశేఖర్‌రాజు కేసు వివరాలు వెల్లడించారు. ఇటీవల తరుచూ డీజిల్ దొంగతనం జరుగుతున్నట్లు పలు ఫిర్యాదులు వస్తున్నాయి. ఈ నేపథ్యంలో బుధవారం తెల్లవారుజామున వాడపల్లి ఎస్ఐ తన సిబ్బందితో కలిసి ఆర్టీఏ సరిహద్దు చెక్‌పోస్టు వద్ద వాహనాలను తనిఖీ చేస్తుండగా రెండు ఇన్నోవా వాహనాల్లో ఆరుగురు ఆంధ్రా వైపు వెళ్తున్నారు. అనుమానం వచ్చి వారిని తనిఖీ చేశారు. అందులో డీజిల్ క్యాన్లు, పైపులు ఇతర సామగ్రి ఉండడంతో అదుపులోకి తీసుకుని విచారణ చేపట్టారు. పలు ఆసక్తికర విషయాలు తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌లోని పల్నాడు జిల్లా బొల్లేపల్లి మండలం సీతారాంపురం తండాకు చెందిన బానోవత్ బాల బద్దునాయక్ అలియాస్ బాలూనాయక్, బానోవత్ గోవింద్‌నాయక్, మేరజుత్ శ్రీను నాయక్, ముడావత్ వెంకటేశ్వర్లు నాయక్, మేరజుత్ బాబ్రీనాయక్, నల్లగొండ జిల్లా నేరేడుగొమ్ము మండలం కొత్తపల్లి గ్రామానికి చెందిన వడ్త్య రాజునాయక్ స్నేహితులు. వీరంతా డబ్బును సులభంగా సంపాదించాలనే ఉద్దేశంతో ఇతర రాష్ట్రాలకు చెందిన వాహనాల్లో డీజిల్ దొంగతనాలకు పాల్పడాలని నిర్ణయించుకున్నారు. వీరంతా కలిసి పల్నాడు జిల్లా నుంచి మూడు ఇన్నోవాలు, జైలో వాహనాల్లో రాత్రి సమయంలో నల్లగొండ, సూర్యాపేట జిల్లాల పరిధిలోని హైవేల వెంట పార్క్ చేసిన లారీలను టార్గెట్ చేసేవారు. డ్రైవర్లు నిద్రమత్తులో ఉండే విషయాన్ని గమనించి లారీ డీజిల్ ట్యాంక్ తాళాలు పగులగొట్టి గానీ లేదా స్క్రూలు తీసి గానీ పైప్ సాయంతో డీజిల్‌ను క్యాన్లలో నింపుకొని ఇన్నోవా, జైలో వాహనాల్లో ఏపీకి తీసుకెళ్లి అమ్ముకునేవారు. వీరిపై జిల్లాలోని పలు స్టేషన్ల పరిధిలో 17 కేసులు నమోదయ్యాయి. కాగా, నెల రోజులుగా దామరచర్ల మండలం కొండ్రపోల్ గ్రామానికి చెందిన నేనావత్ టాకూనాయక్ అలియాస్ ఠాగూర్ వీరి వద్ద నుంచి సుమారు 1,500 లీటర్ల డీజిల్‌ను తక్కువ ధరకు కొనుగోలు చేశాడు. నిందితుల సమాచారం మేరకు ఠాగూర్ నుంచి 700 లీటర్ల డిజిల్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ప్రస్తుతం ఠాగూర్ పరారీలో ఉన్నట్లు డీఎస్పీ తెలిపారు. కేసును ఛేదించిన మిర్యాలగూడ సీఐ కె.వీరబాబు, వాడపల్లి ఎస్ఐ రవి, సిబ్బందిని ఆయన అభినందించారు.